క్లుప్తంగా

ప్రశంసపత్రం అందజేత



మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి ఎస్సై జాడి శ్రీధర్ బెస్ట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఎంపికైన సందర్భంగా ఎస్పీ సురేందర్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన కేసులను చేధించడంలో ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు.

నల్ల తిరుపతికి డాక్టరేట్



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని పొనగల్లు గ్రామానికి చెందిన నల్ల తిరుపతి శుక్రవారం డాక్టరేట్ అందుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బిదాన్ చంద్రకృషి విశ్వ విద్యాలయం నుంచి పూకరట్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో పీహెచ్‌డీ పట్టాను అందించినట్లు తిరుపతి తెలిపారు. ప్రస్తుతం తిరుపతి వరంగల్‌లో ఉద్యాణ శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తిరుపతికి డాక్టరేట్ రావడంపై కుటుంబ సభ్యులు, మిత్రులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు

మల్హర్: పచ్చి రొట్ట సాగు భూసారం పెంపునకు కృషి చేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, మిర్చి పంట వేసే రైతులు తప్పనిసరిగా పచ్చి రొట్ట విత్తనాలు తొలకరి దుక్కి దున్ని చల్లుకోవాలని తెలిపారు. 45 రోజుల తర్వాత పూత దశలో కలియదున్నుతే భూమి సారవతం కావడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు. అలాగే 2023 వర్షకాలం సీజన్ నాటికి రాయితీపై 330 క్వింటాంళ్ల జీలుగు విత్తనాలు మండలంలోని తాడిచర్ల సహకార సంఘం, కొయ్యూరు ఆగ్రోస్ సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పనుల పరిశీలన



మల్హర్: మండలంలోని కొయ్యూరు పీవీనగర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా అమృత్ సరోవర్ కార్యక్రమంలో చేపడుతున్న నీటి కుంట పనులను ఏపీఓ గిరి హరీష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు శాతాన్ని పరిశీలించి, నిర్ణత కొలతల ప్రకారం పూడిక తీసి వేతనాలు ఎక్కువ పొందలాని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, టీఏ రమేష్ పాల్గొన్నారు.

పరామర్శ



టేకుమట్ల: మండలంలోని రామమకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన సాగర్ల రాజయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటంబాన్ని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి శుక్రవారం పరామర్శించారు. రాజయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ అడగాని రామారావు, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, ఎంపేడు సర్పంచ్ కొలిపాక రాజయ్య, నాయకులు ఐలయ్య, నవీన్, మంచాల శ్రీనివాస్, రమేష్, తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

మహాముత్తారం: పెళ్లి బారాత్‌లో ఇద్దరు యువకులు గొడవపడిన సంఘటనలో ఒకరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండికామారం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలపల్లిలో గురువారం రాత్రి ఓ పెళ్లి బారాత్ వద్ద ఇద్దరు యువకులు గోడవపడగా హరుణ్‌లాల్‌పై బూతంరాజు అనే వ్యక్తి బీర్ బాటిల్‌తో తల మీద కొట్టగా తలకు తీవ్రగాయమైంది. వీరిని అడ్డుకుని విడిపించే ప్రయత్నం చేసిన నూనావత్ నవీన్‌ని సైతం కొట్టడంతో హరుణ్‌లాల్ మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దార్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెగ్యులరైజేషన్‌పై వీఆర్‌ఏల హర్షం

● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



భూపాలపల్లి అర్బన్: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని తసీల్దార్ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి పలాభిషేకం చేసి వీఆర్‌ఏలు సంబరాలు చేపట్టుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల జేఏసీ మండల అధ్యక్షుడు మల్యాల రాజు మాట్లాడుతూ.. వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తూ వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా వారసత్వ ఉద్యోగాలు విద్యార్హత గల వారికి పదోన్నతులు కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు కల్వల శ్రీనివాస్, పక్కల మొగిలి పాల్గొన్నారు.

మహదేవపూర్: సీఎం కేసీఆర్ కేబినెట్ సమావేశంలో వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ ప్రకటించిన సందర్భంగా మండలలలోని వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, బాలరాజు, మహేందర్, పెంటయ్య, పోచయ్య, లక్ష్మీ, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: వీఆర్‌ఏల రెగ్యెలరైజ్ చేస్తానని సీఎం కేసీఆర్ ఆమెదించిన సందర్భంగా మండల వీఆర్ ఏలు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీఎం చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ జిల్లా కన్వీనర్ ఏనుగు రాజబాబు, మండల వైస్ చైర్మన్ మధు, సెక్రటరీ మహేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, రవి, శ్రీను, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యూలర్ చేస్తామని మంత్రివర్గంలో తీర్మానం చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలో వీఆర్ ఏల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండలాధ్యక్షుడు లింగమల్ల కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వీఆర్‌ఏలు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ జాక్ జిల్లా కమిటీ కో చైర్మన్ బందెల జితేందర్ మాట్లాడుతూ.. వీఆర్ ఏల కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు పట్టి లక్ష్మణ్, బొడ్డు సతీశ్, రమాదేవి, అజయ్, రాజేశ్వర్, సురేశ్, శ్రీకల, నంది రాకేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల(రేగొండ): వీఆర్‌ఏలను క్రమబద్ధీకరణ చేస్తూ, పలు శాఖల్లో సర్దుబాటు చేస్తూ పేస్కేల్ కల్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ శుక్రవారం రేగొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ చైర్మెన్ మాచర్ల వేణు, వైస్ చైర్మెన్ మద్దెల రమేష్, ప్రధాన కార్యదర్శి బమ్మరాజు, మధూకర్, స్వప్న, సందీప్, చిరంజీవి, రాజసమ్మయ్య, సారంగపాణి, శ్రీకాంత్, స్వామి, రాజు, వెంకటేష్, సదానందం, రాజేంద్రప్రసాద్, శిరీషా, సునీత, స్వప్న, ప్రేమలత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



రేగొండలో..



మహదేవపూర్‌లో..



కాటారంలో..



మల్హర్‌లో..



మహాముత్తారంలో..

దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న ఏఓ జయసింగ్



మంగపేటలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎరువుల దుకాణాలకు లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని ఏఓ పోరిక జయసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా పోరిక జయసింగ్ మాట్లాడుతూ.. లైసెన్స్‌లు షాపుల వద్ద కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ రిజిష్టర్, బిల్లు బుక్‌లను వ్యవసాయ అధికారులతో అటెస్టెషన్ చేయించి సర్టిపై చేయించుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు బిల్లు ఇవ్వాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోపు స్టాక్ నిలువల రిపోర్టు విధిగా ఫారం–డీ రూపంలో అందించాలని సూచించారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోలు చేస్తామన్నారు. ఏఈఓలు రవికుమార్, నవశ్రీ పాల్గొన్నారు.

చట్టాలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలి

మంగపేట: మండలంలోని ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు, విత్తనాల వ్యాపారులు, డీలర్లు చట్టాలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలని మండల వ్యసాయాధికారి చేరాలు అన్నారు. మండలంలోని రైతు వేదికలో మండలంలోని ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు, విత్తనాల వ్యాపారులు, డీలర్లకు ఏఓ చేరాలు, ఎస్సై ఎస్‌కె తాహెర్‌బాబా ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువుల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యక్టు కేసు నమోదు చేయడం జరుగుతుందని రోజు వారిగా స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మహేష్, ఫర్టీ లైజర్స్, విత్తన వ్యాపారులు, డీలర్లు పాల్గొన్నారు.

మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీలక్ష్మి

ఏటూరునాగారం: చాకలి ఎస్సీ సాధన సమితి 6వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రజక సంఘం అధ్యక్షుడు ముక్కెర లాలయ్య ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాద్‌లో జరగబోయే మమాసభ వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే ఈ సభలకు జిల్లాలోని రజకులంతా పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. చాకలిలను ఎస్సీలుగా కేటాయిస్తు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు మెనిఫెస్టోలో ఎస్సీ రిజర్వేషన్ అంశం చేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు ముదిగొండ వెంకటప్పయ్య, ముక్కెర లాలయ్య, పర్వతాల అన్వేష్, ముక్కెర భిక్షపతి, శ్రీరాముల సందీప్, పుణ్యం ప్రశాంత్, బన్ని, మనోజ్, ముక్కెర ముత్తమ్మ, పద్మ, సరిత, లావణ్య, సరిత, వాణి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న రఘుకుమార్

మల్హర్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను మండల నోడల్ అధికారి ఎస్ రఘుకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. గడువులోకి పనులు పూర్తి చేసి, విద్యా సంవత్సరానికి అందించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సదయ్య ఉన్నారు.

ఎస్టీ జాబితాలో బీసీలను చేర్చొద్దు



సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంగపేట: ఎస్టీ జాబితాలో బీసీ కులాలను కలపడాన్ని రద్దు పర్చాలని కోరుతూ ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్యే సీతక్కకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఫిబ్రవరి 10న అసెంబ్లీలో ఎస్టీ జాబితాల్లో 11 బీసీ కులాలను చేర్చుతూ చేసిన తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈనెల 25న ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడిలో భాగంగా ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తీర్మానం రద్దు పర్చుటకు తమకు మద్దతు తెలుపాలని సీతక్కను కోరారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తనవంతు బాధ్యతగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని మీ పోరాటాలకు మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ద్యోగుల సంఘాల నాయకులు గొప్ప సమామరావు, మంకిడి బుచ్చయ్య, గొప్ప వీరయ్య, మద్దె నాగేశ్వర్‌రావు, కొమరం మాధవ రావు, మద్దెల అంజయ్య, చింత కృష్ణమూర్తి, కోరెం శ్రీనివాస్, తోలెం కృష్ణ, జబ్బ రవి, కొండ చెంచయ్య, బోదెబోయిన నర్సింహారావు, పాదెం మల్లికార్జున్, గుండం పురుశొత్తంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సుందరయ్య



వాజేడు: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వాజేడు: పుచ్చల పల్లి సుందరయ్య పోరాటయోధుడని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దబ్బకట్ల లక్ష్మయ్య అన్నారు. మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. నిరంతరం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ధీరుడు సుందరయ్య అన్నారు. నిరంకుశత్వం, దోపిడీ, పీడన లేని సమ సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని వర్ణించారు. అనతరం పార్టీ కార్యకర్తల కోసం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దబ్బకట్ల రఘుపతి, దామోదర్, కృష్ణ బాబు, రమాదేవి, ఆదినారాయణ, రామయ్య తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో సీపీఎం పార్టీ నిర్మించడంలో సుదరయ్య ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఆయన అశయ సాధన కోసం ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయానిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, రత్నం రాజేందర్, లక్ష్మయ్య, నాయకులు రఘుపతి, కుమ్మరి శ్రీను, వంకా రాములు, గ్యానం వాసు, చిట్టెం ఆదినారాయణ, గుంమల్ల ప్రసాద్, కట్ల నర్సింహచారి, తదితరులు ఉన్నారు.

బావిలో పడి సెంట్రింగ్ మేస్త్రీ మృతి

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ మ్యాదరి రాజయ్య (49) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య శుక్రవారం బహిర్భుమికి వెళ్లి నీటి కోసం సమీపంలోని బావి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. బావి లోతు ఎక్కువ ఉండడంతో రాత్రి వరకు వెతికినా రాజయ్య ఆచూకీ లభించలేదు. రాజయ్యకు భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మహదేవపూర్: ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



కాటారం: పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

మహదేవపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి జగదీష్ తెలిపారు. మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని సూరారంలో డ్రైడే, ఫ్రై డే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైయినేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగింపజేసినట్లు తెలిపారు. ఇళ్లలోని చెత్తను గ్రామ పంచాయతీ చెత్త బండి వచ్చినప్పుడు మాత్రమే ఆ బండిలో వేయాలని ప్రజలకు సూచించారు. కుండలు, డ్రమ్ములు, గోళాలు, ప్రతి వారం శుభ్రంగా కడిగి ఆరబెట్టి మళ్లీ నీళ్లు పట్టుకోవాలన్నారు. ఏదేని ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగా గ్రామంలోని ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ఆరోగ్య సిబ్బంది ఇచ్చే సలహాలు సూచనలు తుదితప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ ఖన్నా, మెడికల్ ఆఫీసర్ మాశూక్ అలీ, హెల్త్ సూపర్వైజర్ సత్య నారయణ, హెల్త్ అసిస్టెంట్ కనకదుర్గ, ఏఎస్ఎం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలి

కాటారం: ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై, ఫ్రైడే ఆక్టివిటీస్‌పై ఆరా తీశారు. చెత్తాచెదారం, మురుగునీటి కాల్వల శుభ్రత, పిచ్చి మొక్కల తొలిగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓతో పాటు పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, పంచాయితీ శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

చిట్యాల: ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామంలో పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామయ్య తిర్మలాపూర్ గ్రామంలో పనులను పరిశీలించారు. అలాగే ఎంపీఓ రామకృష్ణ నైన్‌పాక గ్రామంలో ఇళ్లలోని డబ్బాలలో ఉన్న నిలువ నీటిని లేకుండా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరు తమ తమ ఇళ్లలో ఉన్న డ్రమ్ములు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. అలాగే రక్షిత మంచి నీటి సరఫరా ట్యాంకులను పరిశీలించారు. ప్రతి ఇంటిని తిరిగి డ్రైడై పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిట్యాల: నైన్‌పాకలో..

నేడు సర్వసభ్య సమావేశం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ అధ్యక్షతన నేడు(శనివారం) మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

కొనుగోళ్లు ప్రారంభించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: మండలంలోని విలాసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభించాలని శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం చేతికి వచ్చి రోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కేంద్రంలో ఆరబోసి పడిగాపులు కాయాల్సి వస్తుందని తెలిపారు. అకాల వర్షంతో ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అధికారులు కేంద్రం ప్రారంభం చేయకుండ జాప్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని రైతులు హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



శివాజీ (ఫైల్)

గణపురం: మండలకేంద్రానికి చెందిన పెంద్యాల శివాజీ (23) అనే యువకుడు గ్రామ శివారులో ఈ నెల 13న ఒంటిపై పెట్రోల్ పోసుకోని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో అక్కడి నుంచి వరంగల్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారం రోజులగా చికిత్స పొందుతున్న శివాజీ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు శివాజీ ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం అని గణపురం ఎస్సై అభినవ్ తెలిపారు. ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన సదరు ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.